సాక్షి సిద్దిపేట

సోమవారం । 2 । అక్టోబర్ । 2023



పురుగు చావదు..
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ రూరల్‌లో కల్తీ ఎరువులు.. పురుగు మందులు.. రైతుల గుండెల్లో కలవరం సృష్టిస్తున్నాయి.
వివరాలు 8లో ▸



భూమి పూజ అడ్డగింత
స్థల వివాదంతో అక్కన్నపేట మండలం కేశ నాయక్‌తండా పంచాయతీ భవన నిర్మాణ భూమి పూజను గ్రామస్తులు అడ్డుకున్నారు.
వివరాలు 8లో ▸



ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు.
వివరాలు 9లో ▸



పాతూరి గణేశ్‌రెడ్డి
దుబ్బాక
మున్సిపల్ కమిషనర్

సాక్షి ఫోన్ ఇన్

తేదీ: 03-10-2023
సమయం: మంగళవారం
మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు

అంశం:
దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, దోమల వ్యాప్తి, వ్యాధుల తీవ్రత

ఫోన్ చేయాల్సిన నంబర్లు:
9885858881, 7386746502

మల్లన్న ఆలయం.. భక్తజనమయం



స్వామి వారి రాజగోపురం ఎదుట భక్తుల సందడి, (ఇన్‌సెట్లో) పట్నం వద్ద భక్తులు

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. అభిషేకాలు, పట్నాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం, గంగిరేణి చెట్టు వద్ద ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కొంత మంది భక్తులు కొండపైన గల రేణుక ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ బాలాజీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

- కొమురవెల్లి(సిద్దిపేట)

వృద్ధులూ ఓటు హక్కు వినియోగించుకోండి

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



వృద్ధ ఓటర్లను సన్మానిస్తున్న గరీమా అగర్వాల్

దుబ్బాకటౌన్: వృద్ధులు ఓటు హక్కును తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ సూచించారు. ఆదివారం దుబ్బాకలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వృద్ధులను సన్మా నించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు వజ్రాయుధమన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో వృద్ధుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

పల్లా క్షమాపణ చెప్పాలి: ముత్తిరెడ్డి



గుర్జకుంటలో పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి తదితరులు

చేర్యాల(సిద్దిపేట): జనగామ నియోజకవర్గంలో ఇష్టారాజ్యంగా సమావేశాలు నిర్వహిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి తక్షణం క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహించవద్దని పార్టీ అధినేత సీఎం కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారన్నారు. ఆదివారం చేర్యాల మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముత్తిరెడ్డి మాట్లాడుతూ గడిచిన 14 ఏళ్ల కాలంలో జనగామలో కేసీఆర్ వర్గం ఒక్కటే ఉండేదని, కొద్దిరోజులుగా కొందరు చేస్తున్న స్వార్థ రాజకీయాల కారణంగా నియోజకవర్గంలో గ్రూపులు ఏర్పడ్డాయన్నారు. పార్టీ ఆదేశాలను కాదని ఇటీవల పల్లా జనగామలో సోషల్‌మీడియా వారియర్స్ సమావేశం నిర్వహించారన్నారు. సమైఖ్యవాది అయిన పల్లా నియోజకవర్గంలో కార్యకర్తలను, నాయకులను మలినం చేస్తున్నారన్నారు.

కోడ్‌కు వేళాయె.. పనులకు మోక్షం రాదాయె!

పెండింగ్‌లో ప్రతిపాదనలు
- యూజీడీ రెండో విడతకు రూ.49కోట్లు
- సీసీ రోడ్లకు రూ.97కోట్లకుపైనే..
- వరద కాల్వల నిర్మాణానికి మరో రూ.15కోట్లు
- ఆమోదం కోసం ఎదురుచూపులు



మున్సిపాలిటీ పరిధిలోని ఓ కాలనీలో అంతర్గత రోడ్డు దుస్థితి

గజ్వేల్: 'కోడ్' కూసే వేళ...గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో పెండింగ్ ప్రతిపాదనల అంశం తెరపైకి వస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యేలోపు ఆమోదం లభిస్తే తప్ప ఈ పనులకు మోక్షం లభించే అవకాశం లేదు. సీసీ రోడ్ల కోసం ఇటీవల రూ.120కోట్ల ప్రతిపాదనలు పంపితే కేవలం 20శాతం నిధులే విడుదలయ్యాయి. వరద కాల్వల నిర్మాణం కోసం నీటిపారుదల శాఖ ప్రతిపాదించిన రూ.15కోట్ల వ్యవహారం కూడా కొలిక్కిరాలేదు. అదేవిధంగా విలీన గ్రామాల్లో చేపట్టాల్సిన రూ.49కోట్ల యూజీడీ రెండోవిడత ఆమోదంపై జాప్యం నెలకొంది.

వానొస్తే నరకమే..
భారీ వర్షాలొస్తే గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ప్రజలు నరకం చవి చూస్తున్నారు. ప్రత్యేకించి అంతర్గత రోడ్లు చిత్తడిగా మారి అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి నెలకొంటోంది. మున్సిపాలిటీలోని కొన్ని చోట్ల మినహా చాలావరకు కాలనీల్లో రోడ్లు గుంతలమయంగా మారాయి. మున్సిపాలిటీ పరిధిలో సుమారు 80 కిలోమీటర్ల పొడవునా సీసీ రోడ్లకు రూ.120 కోట్ల నిధులు అవసరమని ప్రతిపాదించారు. కానీ ఇందులో రూ.22.87 కోట్లను మాత్రమే ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ఫలితంగా 18కిలోమీటర్ల మేర పనులు చేపడుతున్నారు. మిగతా చోట్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ రహదారికి సైతం ఏటా వరదముప్పు తప్పడం లేదు. ప్రధానంగా ప్రజ్ఞాపూర్ ఊరచెరువు మత్తడి దుంకితే..ఆ నీరు వెళ్లడానికి అవసరమైన నాలాల వ్యవస్థ లేదు. నిజానికి ఈ వరద నీరు నాలాల ద్వారా రాజిరెడ్డిపల్లి కుంటలోకి అక్కడి నుంచి క్యాసారం చెరువులోకి వెళ్లాల్సి ఉంది. కానీ నీరు వెళ్లే మార్గం లేక ఇళ్ల మధ్య నుంచే వరద వస్తోంది. ఇదే నీరు పార్థివేశ్వరస్వామి ఆలయం ఆర్చి వద్ద రోడ్డుపైకి వచ్చి జలమయంగా మారుతోంది. వరద ఉధృతికి గంటలతరబడి వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న అండర్ డ్రైనేజీ గుండా వరద నీరు వెళ్లే విధంగా నిర్మాణాలను చేపట్టాల్సి ఉంది. ఇందుకోసం రూ.12.8 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అదేవిధంగా ఎర్రకుంట నుంచి పాండవుల చెరువు ఫీడర్ ఛానెల్ నిర్మాణానికి మరో రూ.2 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ రెండు ప్రతిపాదనలకు ఆమోదం వస్తేనే పట్టణంలో వరద ముప్పుకు పరిష్కారం లభించే అవకాశముంది. ఏళ్లతరబడి మోక్షం లేకపోవడం వల్ల ఏటా వరద కష్టాలు తప్పడంలేదు.

రెండో విడత యూజీడీకి..
మున్సిపాలిటీ పరిధిలోని విలీన గ్రామాల్లో చేపట్టాల్సిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనుల ప్రతిపాదన ముందుకుసాగటం లేదు. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో రూ.156కోట్లతో 133కిలోమీటర్లకుపైగా పనులు పూర్తి కావస్తుండగా... రెండో విడతలోనూ మరో రూ.49కోట్ల వ్యయంతో విలీన గ్రామాలైన ముట్రాజ్‌పల్లి, క్యాసారం మధిర గ్రామాలైన రాజిరెడ్డిపల్లి, సంగాపూర్, సంగుపల్లిల్లో పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు పంపి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇంతవరకు చడీచప్పుడులేదు. తమ గ్రామాల్లో చేపట్టాల్సిన పనులకు నిధులు విడుదల చేయడంతో ఎందుకు జాప్యం చేస్తున్నారని, తాము మున్సిపాలిటీలో అంతర్భాగం కాదా..? అని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. సకాలంలో నిధులు రాబట్టడంలో మున్సిపల్ పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాం
గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. వీటి ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాం. వస్తే వెంటనే పనుల ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటాం.
– ముత్యంరెడ్డి, 'గడా' ప్రత్యేకాధికారి

న్యూస్‌రీల్

మంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే



మంత్రికి వినతి పత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య

చేర్యాల(సిద్దిపేట): మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కాటం లింగయ్య ఆదివారం మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి చేర్యాల ప్రాంత ఆవశ్యకతను వివరించారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

మాస్టర్ గేమ్స్‌లో సత్తాచాటిన ఎంపీడీఓ



ప్రథమ బహుమతి అందుకుంటున్న ఎంపీడీఓ శ్రీనివాస్

మద్దూరు(హుస్నాబాద్): హైదరాబాద్‌లోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 6వ రాష్ట్ర స్థాయి మాస్టర్ గేమ్స్‌లో మద్దూరు ఎంపీడీఓ శ్రీనివాస్‌గౌడ్ సత్తాచాటారు. 50 ఏళ్ల విభాగంలో నిర్వహించిన అథ్లెటిక్ (ట్రాక్ అండ్ ఫీల్డ్) పోటీలలో భాగంగా 200 మీటర్ల పరుగు పోటీలో శ్రీనివాస్‌గౌడ్ ప్రథమ స్థాయిలో నిలిచారు. గతంలో కూడా శ్రీనివాస్ మాస్టర్ గేమ్స్ జాతీయ స్థాయిలో రాణించారు. ఎంపీడీఓను ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, తోటి ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.


రంగనాయక సాగర్ అద్భుతం



రంగనాయక సాగర్‌ను పరిశీలిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధి చంద్లాపూర్ శివారులోని రంగనాయక సాగర్ రిజర్వాయర్‌ను ఆదివారం ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు సందర్శించారు. రిజర్వా యర్ బండ్, పంప్ హౌస్‌ను పరిశీలించారు. రిజర్వాయర్ విస్తీర్ణం, సాగులోకి వచ్చే భూమి, పంపింగ్ విధానం ఏఈ ఖాజా మ్యాప్ ద్వారా వివరించారు. రిజర్వాయర్ నిర్మాణం అద్భుతంగా ఉందని ఈ సందర్భంగా చాగంటి కితాబిచ్చారు. ఈ ప్రాంతం గొప్ప పర్యాటక కేంద్రంగా మారుతుందన్నారు.

రావి ఆకుపై మహాత్ముడు



మనోహరబాద్(తూప్రాన్): గాంధీ జయంతి సందర్భంగా ఓ ఉపాధ్యాయుడు రావి ఆకుపై మహాత్ముని చిత్రపటాన్ని గీసి శుభాకాంక్షలు తెలియజేశాడు. మండల కేంద్రం మనోహరబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు బ్రహ్మచారి రావి ఆకుపై గాంధీ చిత్రపటాన్ని చక్కగా చిత్రీకరించాడు. దీనిని చూసిన పలువురు అధికారులు అభినందించారు.

ప్రశాంతంగా మిలాద్ ఉన్ నబీ ర్యాలీ



సిద్దిపేటలో ముస్లింల ర్యాలీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహ్మద్ ప్రవక్త జన్మదినం (మిలాద్ ఉన్ నబీ) పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్రంలో ముస్లింలు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఫిర్దాస్ మసీద్ నుంచి ఇక్బాల్ మినార్, పట్టణంలోని ఈద్గా వరకు ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ ఇస్లాం ధర్మం శాంతికి నిదర్శమని, శాంతి సమసమాజ స్థాపనే ఇస్లాం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రవక్త కారణ జన్ముడని ఆయన చూపిన బాటలో నడిస్తే, జీవితం అంతా సుఖ శాంతులు వెల్లివిరిస్తాయన్నారు. ర్యాలీ సందర్భంగా ఏసీపీ సురేందర్ రెడ్డి, సీఐలు కృష్ణారెడ్డి, రవి కుమార్, రామకృష్ణ, ఎస్‌ఐలు, పోలీస్‌ల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులు సీపీఐ ఘనతే



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

- కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉంటేనే న్యాయం
- పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎన్నో ఉద్యమాలు, పాదయాత్ర తర్వాత గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను సాధించుకున్నామని, సీపీఐ పోరాటాలతోనే ఈ ప్రాంతానికి ప్రాజెక్టులు వచ్చాయని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం గౌరవెల్లిలో పార్టీ జనరల్ బాడీ సమావేశం మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చాడ మాట్లాడుతూ మెట్టప్రాంతంలో ప్రాజెక్టు నిర్మించేందుకు సీపీఐ అలుపెరగని పోరాటాలు చేసిందన్నారు. నేటి పాలకులు మాత్రం ప్రాజెక్టు మేమే పూర్తి చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. నిరుపేద ప్రజలకు న్యాయం జరగాలంటే కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉండాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, జిల్లా కార్యవర్గ సభ్యులు వనేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లను చర్చలకు పిలవాలి
హుస్నాబాద్: కరోనా కాలంలో ఆశా వర్కర్లను దేవతలు అని పొగిడిన పాలకులు కనీస వేతనం నిర్ణయించడంలో చలనం లేదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో ఆశా వర్కర్ల దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఆశా వర్కర్లను చర్చలకు పిలిచి నిర్ణయం తీసుకోవాలన్నారు. త్వరలోనే సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులకు లేఖ రాస్తానని తెలిపారు.

స్వచ్ఛతకు మేము సైతం..

పల్లెలు, పట్టణాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆదివారం ఏక్ తారీఖ్.. ఏక్ గంట.. ఏక్ సాత్ కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించారు. చీపురు పట్టి రోడ్లను, చెత్తాచెదారం నిండిన ప్రదేశాలను శుభ్రం చేశారు. స్వచ్ఛత పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వర్గల్ బస్టాండ్‌ను శుభ్రం చేస్తున్న నవోదయ విద్యార్థులు

ఐదేళ్ల నిరీక్షణకు తెర

- దుబ్బాకలో నేడు ఐఓసీ ప్రారంభోత్సవం
- మంత్రి హరీశ్‌రావు రాక



దుబ్బాకలో నిర్మించిన సమీకృత కార్యాలయ భవన సముదాయం

దుబ్బాకటౌన్: సరిగ్గా ఐదేళ్ల నిరీక్షణ తర్వాత దుబ్బాక పట్టణంలో నిర్మించిన ఐఓసీ (ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) ప్రారంభోత్సవం సోమవారం జరగనుంది. రూ.17 కోట్ల నిధులతో నిర్మించిన ఐఓసీని మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్నారు. అలాగే పట్టణంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించనున్నారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.73 లక్షలతో ఏర్పాటు చేసిన ఘన వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం (ఎఫ్ఎస్‌టీపీ–ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) ను సైతం మంత్రి ప్రారంభిస్తారు. ఇందుకు సంబంధించి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

పునాదులకే రూ.6కోట్లకు పైగా..
దుబ్బాక పట్టణంలో 18 ప్రభుత్వ శాఖల సమీకృత కార్యాలయాల భవన సముదాయం(ఐఓసీ) 2018 లో నిర్మాణం ప్రారంభమైంది. అప్పుడు దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి పట్టుబట్టి సీఎం కేసీఆర్ తో ఐఓసీ భవనం నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ కింద రూ.17 కోట్లు మంజూరు చేయించారు. పట్టణంలోని రామసముద్రం వెనుకాల 4 ఎకరాల స్థలంలో నిర్మాణం మొదలు పెట్టారు. నిర్మాణ స్థలం పూర్తిగా చెరువు కట్ట వెనకాల ఉండడం.. జాలు భూమి కావడంతో కేవలం పునాదికే రూ.6 కోట్లకు పైగా నిధులు ఖర్చు అయ్యాయి. ఉన్న నిధులన్నీ పునాదులకే అవుతుండడంతో పనులు నత్తనడకన సాగుతూ వచ్చాయి. ఈ క్రమంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు సైతం పలుసార్లు సందర్శించి అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఎట్టకేలకు 5 ఏళ్ల తర్వాత రూ.15 కోట్ల పై చిలుకు నిధులతో కింది అంతస్తును పూర్తి చేశారు. పలు శాఖల గదులను సైతం సిద్ధం చేసి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయడం శోచనీయం. మొత్తం భవనం నిర్మించాలంటే మరో రూ.10 కోట్లు అవసరమని అధికారులు చెబుతున్నారు.

సోలిపేట విగ్రహం



దుబ్బాక పట్టణంలోని బల్వంతాపూర్ రోడ్డులో నూతనంగా నిర్మించిన వెయ్యి డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయాల వద్ద దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి విగ్రహాన్ని నెలకొల్పనున్నారు. పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి విశేషంగా కృషి చేశారు. ఆయన కృషితోనే పట్టణంలో వెయ్యి డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మాణం కావడంతో అందులో పేద ప్రజలు ఉంటున్నారు. తమ కలను నిజం చేసిన దివంగత నేత జ్ఞాపకార్థం రామలింగారెడ్డి విగ్రహం ఆవిష్కరణ జరుగనుంది. ఈ కార్యక్రమంలో రామలింగారెడ్డి సతీమణి సుజాత, కుమారుడు సతీష్‌తో పాటు కుటుంబ సభ్యులు, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి పలువురు ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు.

విత్తనాలు ఉత్పత్తిచేసే స్థాయికి రైతులు ఎదగాలి

ఏకలవ్య ఫౌండేషన్ సీఈఓ మధుకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఏకలవ్య సంస్థ సీఈఓ మధుకర్

తొగుట(దుబ్బాక): రైతులు విత్తనాలు ఉత్పత్తిచేసే స్థాయికి ఎదగాలని ఏకలవ్య ఫౌండేషన్ సీఈవో మధుకర్ సూచించారు. మండలంలోని వెంకట్రావుపేటలో రైతు ఉత్పత్తి దారుల సంస్థ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగుచేసే పంటలకు సంబంధించిన విత్తనాలను వారే ఉత్పత్తి చేసుకోవాలన్నారు. సేంద్రియ ఎరువులతో పంటలు సాగుచేసేలా రైతుల్లో మార్పురావాలన్నారు. ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. ఉత్పత్తిదారుల సంఘం సభ్యత్వాలను పెంచాల్సిన అవసరముందన్నారు. సమావేశం ప్రారంభానికి ముందు ఇటీవల మరణించిన రైతు శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ రాంరెడ్డి, సర్పంచ్ లీలాదేవి, కో ఆప్షన్ సభ్యుడు కలీముద్దీన్, ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, ఏకలవ్య సంస్థ ట్రస్టీలు తిరుపతి, యాదవరెడ్డి, పీఏసీఎస్, ఏఎంసీ, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా 5కే రన్ శిక్షణ



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ శ్వేత

సిద్దిపేటజోన్: మనిషి జీవితంలో వాకింగ్, రన్నింగ్, యోగ ఒక భాగంగా ఉండాల్సిన అవసరం ఉందని పోలీస్ కమిషనర్ శ్వేత అన్నారు. స్థానిక నెక్లెస్ రోడ్ వద్ద సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత 5కే రన్ శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ మన ఒక గంట మనం మన ఆరోగ్యం కోసం ఆలోచిస్తే ఆసుపత్రికి వెళ్లే అవసరం ఉండదని చెప్పారు. వచ్చే ఏడాది ఆగస్టులో హాఫ్ మారథాన్ సెకండ్ ఎడిషన్ 10 వేల మందితో ఘనంగా నిర్వహించేందుకు ప్రయత్నాలు చేద్దామన్నారు. అందుకు సిద్దిపేట ప్రజలు ఇప్పటి నుంచే ప్రాక్టీసు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బాపురెడ్డి, ప్రతినిధులు రాజు, రాజిరెడ్డి, శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

4న ఎస్సీ ఉపకులాల ఆత్మీయ సభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మోచి సంఘం నాయకులు

గజ్వేల్‌రూరల్: ఎస్సీ ఉపకులాల ఆత్మీయ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లేమ్ ప్రభాకర్, ఉమ్మడి జిల్లా కోశాధికారి బైరి ప్రభాకర్ పిలుపునిచ్చారు. బహిరంగ సభకు చెందిన కరపత్రాలను ఆదివారం వారు ఆవిష్కరించారు. ఎస్సీలలోని ఉపకులాల పట్ల చిన్నచూపు తగదని, ఉపకులాలకు అసెంబ్లీలో 6 స్థానాలను కేటాయించడంతో పాటు దళితబంధులో 40 శాతం, గృహలక్ష్మీ పథకంలో ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. 4న హైద్రాబాద్‌లో జరిగే ఈ సభకు అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్, కొమురం భీం మనుమడు సోనేరావు భీంలు హాజరవుతున్నారని చెప్పారు. ఎస్సీ 57 ఉపకులాల హక్కుల సాధన కోసం పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం ఆధ్వర్యంలో జరిగే ఈ సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మోచి సంఘం గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు రవి, సభ్యులు వేణుగోపాల్, శ్రీనివాస్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నాచగిరిలో అర్చకుల శిక్షణ ప్రారంభం



శిక్షణ శిబిరానికి హాజరైన అర్చకులు

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన నాచారంగుట్ట నాచగిరి శ్రీలక్ష్మీనృసింహక్షేత్రంలో ఆదివారం ధూప దీప నైవేద్య అర్చకుల శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో అర్చకులు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. తొలిరోజు వీరశైవ, శైవ ఆగమ అభ్యర్థులకు పునశ్చరణ తరగతులు నిర్వహించారు. ఝరాసంగం ప్రధానాచార్యులు శివప్రసాద్ స్వామి, బడంగ్‌పేట ప్రధానాచార్యులు జగదీశ్వరస్వామి, అర్చక సంఘ ప్రతినిధి త్రిగుళ్ల గోపాలకృష్ణశర్మ, నాచారం గుట్ట వేద పండితులు నాగబాల కామేశ్వరశర్మ అర్చన సంబంధ అంశాలు వివరించారు. దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, నాచగిరి ఏసీ అన్నపూర్ణ, ఇన్‌స్పెక్టర్ రంగారావు కార్యక్రమంలో పాల్గొని పర్యవేక్షించారు.



పురుగు చావదు.. పైరు పెరగదు..

- కలవర పెడుతున్న కల్తీ ఎరువులు
- యూరియాకు అదనంగా రూ.50 వసూలు
- తూతూ మంత్రంగా తనిఖీలు
- గుట్టుగా సాగుతున్న విక్రయాలు

జిల్లాలో కల్తీ ఎరువులు.. పురుగు మందులు.. రైతుల గుండెల్లో కలవరం సృష్టిస్తున్నాయి. రోజురోజుకూ రసాయన ఎరువులు, పురుగు మందులు కంపెనీలు వేలల్లో పుట్టుకొస్తున్నాయి. అసలే వేటిని వాడాలో తెలియక సతమతమయ్యే రైతులపై ఈ కల్తీ మందులు మరింత కలకలం సృష్టిస్తున్నాయి. రైతులు తమ శ్రమకు తగ్గ దిగుబడి పొందాలని ఆశపడతారు. ఆ ఆశని కల్తీ మందుల వ్యాపారులు ఆసరాగా తీసుకుంటున్నారు. మోసాలకు గురిచేస్తున్నారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.

హుస్నాబాద్‌రూరల్: దిగుబడి మంచిగా ఉండాలని, పైరు ఏపుగా పెరగాలని రైతులు ఎరువుల దుకాణంలో దొరికే రకరకాల రసాయన మందులు కొనుగోలుచేసి పంటలకు స్ప్రే చేస్తుంటారు. అయనా పురుగు చావదు.. పైరు పెరగదు. తమ లాభాల కోసం కొందరు ఫర్టిలైజర్ షాపుల యాజమానులు రైతులకు మాయమాటలు చెప్పి అనుమతి లేని కల్తీ రసాయన మందులను అమ్మిసొమ్ము చేసుకుంటున్నారని పలువురు రైతులు విమర్శిస్తున్నారు. నకిలీ రసాయన ఎరువులు దుకాణంలో కన్పించవు.. కాని రహస్య ప్రదేశాల నుంచి తెచ్చి రైతులకు ఇస్తారు. రసాయన ఎరువుల నాణ్యత గురించి తెలియని రైతులు వాటిని వాడి నష్ట పోతున్నారు. నకిలీ రసాయన పురుగు మందుల వాడకం వల్ల ఆర్థిక భారంతో పాటు పంట కూడా నష్టపోతున్నారు. దానికి తోడు వర్షాల అదనుచూసి వ్యాపారులు యూరియాను బ్లాక్‌చేసి బస్తాకు రూ.50లు అదనంగా తీసుకుని గుట్టుగా విక్రయిస్తున్నారు. రైతులకు సేవలు అందించాల్సిన ఆగ్రో, రైతుమిత్ర కేంద్రాలు కూడ యూరియాలోడు రాకముందే బస్తాలు అయిపోయినట్లు చెప్పి తమను మోసం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనలో మిరప రైతులు..

హుస్నాబాద్ మెట్ట ప్రాంత రైతులు ఎక్కువగా పత్తి, మొక్కజొన్న, వరి సాగు చేస్తుంటారు. రెండేళ్లుగా పత్తి పంట ఆశించిన మేర దిగుబడులు రాకపోవడంతో రైతులు పత్తిని తగ్గించి మిర్చి పంట సాగుకు మొగ్గు చూపించారు. చాలా చోట్ల మిరప సాగుచేశారు. అయితే పంటకు ముడుత, పురుగు ఎక్కువగా ఆశించింది. ఎరువుల మందుల వ్యాపారులు దీనిని ఆసరాగా చేసుకుని వారికి నకిలీ రసాయన ఎరువులను అంటగడతున్నారు. వాటిని ఎంత స్ప్రే చేసినా పురుగు చావడం లేదని, పైరు ఎదుగడం లేదని రైతులు ఆందోళ చెందుతున్నారు.



ముడుత పోని మిరప చెట్టు

తూతూ మంత్రంగా తనిఖీలు..

పంటల సీజన్‌లో రైతుల ఎలాంటి పంటలు సాగుచేస్తున్నారు. వాటికి ఆశించే తెగుళ్లు, వాడవలసిన మందుల గురించి అధికారులు రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. కాని వ్యవసాయ అధికారులు ఆ దిశగా దృష్టి సారించినట్టు ఎక్కడా కనిపించడంలేదు. అలాగే ఎరువుల వ్యాపారులు విక్రయించే రసాయన మందులు, వాటి నాణ్యత ప్రమాణలను తనిఖీచేసి రైతులకు సూచనలు చేయాల్సిన బాధ్యత అధికారుల పై ఉంది. కాని వారు నామమాత్రంగా తనిఖీలు నిర్వహించడంతో వ్యాపారులు నాసిరకం రసాయన మందులు తెచ్చి రైతులకు అంటకడుతున్నారు. వాటి వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇటీవల హుస్నాబాద్‌లో ఏర్పడిన యూరియా కొరత వల్ల బస్తాకు అదనంగా రూ.50లు వసూలు చేసిన విషయంపై తనిఖీలు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నకిలీ మందులకే పైసలు పోవట్టే..



వానలు పడితే వరికి యూరియా అవసరం ఉంటది. లారీ నుంచి బస్తాలు దించక ముందే యూరియా అయిపోయినట్లు చెప్పవట్టే. నా పక్కపొంటి నర్సయ్య హన్మకొండ రోడ్డు ఫర్టిలైజరు దుకాణంకు పోతే బస్తాకు రూ.50లు అదనంగా తీసుకొని నాలుగు బస్తాలు ఇచ్చిండ్రు. నేను మిరప తోటకు ఇప్పటికే రూ.10 వేల మందులు కొట్టినా పురుగు చస్తలేదు.. ముడుత పోతలేదు.. ఏ మందు కొట్టినా ఏం లాభం లేదు నకిలీ మందులకే పైసలు పోవట్టే.

– జనగామ సంపత్‌రావు, రైతు, గాంధీనగర్

రాష్ట్రంలో 5.20 లక్షల మందికి పింఛన్లు

- ఆసరా ఇచ్చే కేసీఆర్‌ను ఆశీర్వదించాలి
- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

హుస్నాబాద్‌రూరల్: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 5.20 లక్షల మందికి పింఛన్లు, దివ్యాంగులకు ప్రతి నెలా రూ.4,016ల పింఛన్ అందజేస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వాదించాలని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపెల్లి వినోద్‌కుమార్ కోరారు. పోతారం(ఎస్) శుభం గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దివ్యాంగులకు రూ.200, రూ.300ల పింఛన్ మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతంలో కరువుతో ఆకలి చావులు, ఆత్మహత్యలు, ఎన్‌కౌంటర్లు ఉండేవన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక కాళేశ్వరంతో పాటు గోదావరి నదిపై 5 ప్రాజెక్టులను నిర్మించి గోదావరి జలాలను తెచ్చిన అపర భగీరథుడు కేసీఆర్ అన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టుతో మెట్ట నేల పచ్చని పైర్లతో కళకళలాడుతోందని, 24 గంటల కరెంట్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. అలాగే పదివేల మందికి మెడికల్ సీట్లు వచ్చాయన్నారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మాట్లాడుతూ అర్హత ఉన్నవారికి ధృవీకరణ పత్రాలు అందిస్తామని చెప్పారు. గృహలక్ష్మీ పథకంలో 5శాతం ఇండ్లను కేటాయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర దివ్యాంగుల కో–ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణగౌడ్, హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, సిద్దిపేట జెడ్పీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజినితిరుపతిరెడ్డి, జెడ్పీటీసీలు భూక్య మంగ, గీకురు రవీందర్, ఎంపీపీలు లకావత్ మానస తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

ప్రజల సహకారంతోనే స్వచ్ఛ గ్రామాలు



స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న కాశీనాథ్

అల్లాదుర్గం(మెదక్): ప్రజల సహకారంతోనే స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దగలమని దక్షిణ మధ్యరైల్వే బోర్డు మెంబర్ కాశీనాథ్ అన్నారు. చేవెళ్ల గ్రామంలో ఆదివారం జరిగిన స్వచ్ఛత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉండగలమని చెప్పారు. ఇళ్ల ఎదుట, వీధులలోను చెత్త పడవేయవద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యలక్ష్మి, కార్యదర్శి వీరబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ లింగం తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



మృతిచెందిన సునీల్

శివ్వంపేట(నర్సాపూర్): సర్వీస్ వైర్ తొలగించేందుకు విద్యుత్ స్తంభం ఎక్కిన ఒక యువకుడు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన సంఘటన మండల పరిధి చిన్నగొట్టిముక్ల కొత్త కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుమ్మడి సునీల్(25) అదే కాలనీకి చెందిన బాల్‌రాజ్‌గౌడ్ కల్లు దుకాణంకు సంబంధించి సర్వీస్ వైర్ తొలగించమని సునీల్‌తో చెప్పడంతో అతను సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ బంద్‌చేసి స్తంభం పైకి ఎక్కాడు. సర్వీస్ వైర్ తొలగిస్తున్న క్రమంలో అదే స్తంభంపై ఉన్న మరో విద్యుత్‌లైన్ వైర్ తగలడంతో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. సనీల్ తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ రవికాంత్‌రావ్ తెలిపారు.

కనిపించకుండా పోయి..



భాస్కర్‌రావు (ఫైల్)

నర్సాపూర్‌రూరల్: కాలకృత్యాలు తీర్చుకొని వస్తానని ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి మృతదేహం చెరువులో లభ్యమైన ఘటన నర్సాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ మొగల్తూరుకు చెందిన నౌండ్రు భాస్కర్‌రావు(50) తన కుటుంబంతో నర్సాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. శనివారం సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకొని వస్తానంటూ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ తెలియలేదు. నర్సాపూర్ రాయరావు చెరువులో ఆదివారం అతడి మృతదేమం లభ్యమైంది. భాస్కర్ కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు నర్సాపూర్ ఎస్‌ఐ శివకుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అందుబాటులోకి వెయ్యి పడకల ఆస్పత్రి

- జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్
- ప్రారంభానికి సర్వం సిద్ధం

సిద్దిపేటకమాన్: వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులో 28 ఏకరాల విస్తీర్ణంలో నిర్మించిన వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించేందుకు కావాల్సిన ఏర్పాట్లను ఆదివారం ఆమె పరిశీలించారు. మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలాథామస్, ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ కాశీనాథ్ ఆసుపత్రిలో కల్పించిన వసతులు, వివిధ విభాగాల గురించి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ ఆమె మీడియాతో మాట్లాడుతూ.. వెయ్యి పడకల ఆసుపత్రిని త్వరలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని చెప్పారు. ఆసుపత్రి నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావడంతో ప్రజలకు అతి త్వరలో అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆమె ఆదేశించారు. ఆసుపత్రిలో బెడ్స్, ఫర్నీచర్, విభాగాల వారిగా వైద్యులు, వైద్య సిబ్బంది, పరికరాలు, తాగునీరు, వాష్ రూంలు, విద్యుత్ సరఫరా వంటివి సక్రమంగా ఉండేటట్టు చూడాలని టీఎస్ఎంఎస్ఐడీసీ ఇంజనీర్ అధికారులకు సూచించారు. ఆసుపత్రి వాతావరణం పరిశుభ్రంగా ఆహ్లాదకరంగా ఉండాలని, ప్రతి డిపార్ట్‌మెంట్ సులభంగా అర్థమయ్యే విధంగా ప్రతి గదికి నెంబర్లు, పేర్లతో కూడిన డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంఈ రమేష్‌రెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఈ రాజేందర్‌కుమార్, ఎస్ఈ సురేందర్‌రెడ్డి, డీఈ విశ్వప్రసాద్, ఈఈ శ్రీనివాస్, మెడికల్ కళాశాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్



ప్రారంభానికి సిద్ధమైన ఆస్పత్రి భవనం

పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కోరారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతెలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మతో కలిసి నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని, ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రహరీని ఆదివారం ప్రారంభించారు. అనంతరం భూంపల్లి మండల కేంద్రంలోని 94 డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. అలాగే ప్రాథమిక పాఠశాలతో పాటు పద్మశాలి సంఘం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుబ్బాక ప్రజానీకం అవకాశం ఇస్తే సిద్దిపేట, గజ్వేల్ తరహాలోనే మరింత బిన్నంగా దుబ్బాకను తీర్చిదిద్దుతానన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ ప్రభుత్వం ముందంజలో ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా శర్మ అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పని చేస్తుందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. కార్యక్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వేలేటి రాధాకృష్ణ శర్మ, ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు తదితరులు పాల్గొన్నారు.



డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రారంభిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

భూమి పూజను అడ్డుకున్న గ్రామస్తులు



నిలిచిన పంచాయతీ భవన నిర్మాణం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం కేశనాయక్‌తండా పంచాయతీ భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. స్థల ఎంపికలో ఏర్పడిన వివాదం ఆదివారం ఘర్షణకు దారితీసింది. గ్రామ పంచాయతీ భవనాన్ని కేశనాయక్‌తండాలోనే నిర్మించాలని, క్రీడా ప్రాంగణం పక్కన నిర్మిస్తే తాము ఒప్పుకోబోమని కొన్ని రోజులుగా ఆ గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం సర్పంచ్ రవీందర్ క్రీడా ప్రాంగం పక్కన పంచాయితీ భవనం నిర్మాణానికి భూమిపూజ చేయడాన్ని కేశనాయక్‌తండా ప్రజలు అడ్డుకున్నారు. విషయం తెలుసుకుని అక్కడికి చేరిన ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌తో భవన నిర్మాణం క్రీడాప్రాంగణం పక్కన నిర్మించొద్దని విన్నవించారు. దీంతో భవనం ఎక్కడ నిర్మించాలో తర్వాత తెలియజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ రవీందర్ చెప్పారు.

చాకలి ఐలమ్మ సేవలు చిరస్మరణీయం

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

ములుగు(గజ్వేల్): తెలంగాణ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న తొలి మహిళ చాకలి ఐలమ్మ చేసిన సేవలు చిరస్మరణీయం అని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పేర్కొన్నారు. ములుగు మండలం మామిడ్యాల ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరురాలు ఐలమ్మ అని, ప్రతి ఒక్కరూ ఆమె జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. రాష్ట్రంలో 70 వేల రజక కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ అందజేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సాయుధ ఉద్యమ సమయంలో చాకలి ఐలమ్మ చూపిన ధైర్య సాహసాలు మరువ లేనివని గుర్తు చేశారు. కారక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, ఉమ్మడి మెదక్‌జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దేవందర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సర్పంచ్ నాగరాణి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తదితరులు

హామీలు అమలు చేయండి



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

గజ్వేల్‌రూరల్: మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమ్మెలో భాగంగా ఆదివారం స్థాని క అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇంకా అమలు కాలేదని, పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ర్యక్రమంలో వెంకటచారి, బాల్‌లక్ష్మీ, బాసయ్య, భాగ్యమ్మ, లక్ష్మీ, అమృత, యాదమ్మ దితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య



మహేశ్(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): మద్యానికి బానిసై, ఆర్థిక ఇబ్బందుల వల్ల తీవ్రంగా మనస్తాపం చెందిన ఒక యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మండల పరిధిలోని శివ్వాయిపల్లి గ్రామంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కోల మహేశ్(25) కొంత కాలంగా మద్యం సేవించి కుటుంబీకులతో గొడవ పడుతుంటేవాడు. ఈ క్రమంలో మహేశ్ శనివారం తన భార్య కృష్ణవేణితో గొడవపడి పుట్టింటికి వెళ్లిపొమ్మనగా ఆమె తన పుట్టింటికి వెళ్లింది. మహేశ్ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్థానికులు తెలిపారు. విషయం గమనించిన స్థానికులు మహేశ్‌ను మెదక్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు మెదక్‌రూరల్ పోలీసులు తెలిపారు.

మృతదేహంతో ఆందోళన

7 గంటల పాటు నిరసన



శ్రీకాంత్ ఇంటి ఎదుట బైఠాయించిన ప్రశాంత్ కుటుంబ సభ్యులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని పందిల్ల గ్రామ సమీపంలో శనివారం రాత్రి రెండు బైక్‌లు ఢీ..కొన్న ఘటనలో అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన పెండ్యాల ప్రశాంత్ మృతి చెందాడు. అయితే నూనె శ్రీకాంత్ ఢీ..కొట్టడంతోనే ప్రశాంత్ మృతి చెందాడని కుటుంబీకులు, బంధువులు, గ్రామస్థులు శ్రీకాంత్ ఇంటి ఎదుట ప్రశాంత్ మృతదేహంతో ఆందోళన చేశారు. దేళ్లలోపు పిల్లలు ఉన్నారని, న్యాయం చేయాలని నిరసిస్తూ ఏడు గంటలపాటు నిరసన తెలిపారు. శ్రీకాంత్ కూడా రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో కరీంనగర్‌లో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇంటివద్ద ఎవరూ లేకపోవడంతో పెద్దమనుషుల సమక్షంలో సోమవారం మాట్లాడుకుందామని గ్రామస్థులు నచ్చచెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

అనారోగ్యంతో ఆటో డ్రైవర్..



చిరంజీవి (ఫైల్)

మనోహరాబాద్/వెల్దుర్తి(తూప్రాన్): అనారోగ్యానికి తోడు మద్యానికి బానిసైన ఓ ఆటోడ్రైవర్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన రామాయిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం వెల్దుర్తి మండలం మెల్లూర్ గ్రామానికి చెందిన పిట్ల చిరంజీవి(31) కొంతకాలంగా ఫిట్స్‌వ్యాధితో బాధపడుతున్నాడు. ఆటో నడపడం, చిన్నచిన్న పనులకు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అనారోగ్యానికి తోడు మద్యానికి బానిసై ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవ రూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెల్లడించారు.

పెళ్లి కావడంలేదని.. రైలు కింద పడి...



జంగం సాగర్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట రైల్వేగేట్ సమీపంలో అదే గ్రామానికి చెందిన జంగం సాగర్ (27) ఆదివారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పెళ్లి కావడంలేదని బెంగ పెట్టుకున్న సాగర్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు రైల్వే పోలీసులు తెలిపారు. రైల్వే ఎస్ఐ నాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.